# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రభుత్వ సేవలు ప్రజలకు ఉపయోగ పడేలా బిజినెస్ రూల్స్ సవరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**2) తెలంగాణాలో స్వయం సహాయక సంఘాలతో కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లను ఏర్పాటు చేయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.**

**3) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పూర్తైన భవనాలను వచ్చే నెల నుంచి జీఏడీకి అప్పగిస్తామని పురపాలక శాఖమంత్రి నారాయణ చెప్పారు.**

**4) ఆంధ్రప్రదేశ్‌లో  నిర్మాణంలో ఉన్న వివిధ సబ్ స్టేషన్లలో జరుగుతున్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు.**

==========================

టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రభుత్వ సేవలు ప్రజలకు ఉపయోగ పడేలా బిజినెస్ రూల్స్ సవరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అన్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లి లోని క్యాంప్ కార్యాలయంలో ఆయన నిన్న ఆర్టీజీఎస్ పనితీరుతో పాటు.. వివిధ శాఖల కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో అమలవుతున్న తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..... టెక్నాలజీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిందని.. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా ఉండాలి కానీ.. నిబంధనలు అడ్డుకాకూడదని స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ సవరించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణాలో స్వయం సహాయక సంఘాలతో కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లను ఏర్పాటు చేయిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 సూపర్ బజార్లకు నామమాత్రపు లీజుపై స్థలాలను కేటాయిస్తామని ఆయన అన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలోనే రైస్ మిల్లులు, లాజిస్టిక్స్ హబ్‌లు, గోదాముల నిర్మాణం చేయిస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 8 వేల మహిళా సంఘాల భవనాలకు ఆయన నిన్న హైదరాబాద్‌లో సచివాలయం నుంచి దృశ్య మాధ్యమం ద్వారా శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ఇకపై రైస్ మిల్లుల గోడౌన్లలో

ధాన్యం నిల్వలు పెట్టబోమని, మహిళా సంఘాలే వడ్లు కొనుగోలు చేసి ప్రభుత్వానికి బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్స్, అధికారుల భవనాల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ చెప్పారు. ఆలిండియా సర్వీస్ అధికారుల నివాసాలు, ఐకానిక్ టవర్స్ నిర్మాణాలను మంత్రి గత రాత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజధాని అమరావతిలో ఐఏఎస్ అధికారుల కోసం నిర్మిస్తున్న టవర్స్ లో చాలా వరకు పనులు పూర్తయ్యాయని తెలిపారు. వచ్చే నెల నుంచి దశలవారీగా భవనాలను జీఏడీకి అప్పగిస్తామని చెబుతూ..

.. వాయిస్..30 సెకన్లు

---------------------------

విజ్జేశ్వరం నుండి సిద్ధాంతం మధ్య ఉన్న వశిష్ట రైట్ ఫ్లడ్ బ్యాంక్ కెనాల్ మీదుగా ఏటిగట్టు నిర్మించాలనే ప్రతిపాదనను పరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్.. ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ను కోరారు. రాజమహేంద్రవరం పర్యటన ముగిసిన అనంతరం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిన్న నిడదవోలు నియోజకవర్గంలోని విజ్జేశ్వరంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ జలవనరుల శాఖకు సంబంధించిన ఏటి గట్టు ప్రతిపాదనను పవన్ కళ్యాణ్ కు వివరించారు. మంత్రి విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన ఉపముఖ్యమంత్రి గోదావరి బండ్ తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న వివిధ సబ్ స్టేషన్లలో జరుగుతున్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఆయన నిన్న మూడు డిస్కంల సీఎండీలు, ట్రాన్స్ కో ఉన్నతాధికారులతో దృశ్యమాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ , ప్రజలకు జవాబుదారీగా మార్చే దిశగా పలు కీలక ఆదేశాలు ఇచ్చారు. విద్యుత్ సరఫరాలో వచ్చే అంతరాయాల సమయంలో వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు మూడు డిస్కంల పరిధిలోని 1912 కాల్ సెంటర్ల ద్వారా ప్రజలకు మరింతగా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

.. వాయిస్..30 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై నమ్మకంతో గడిచిన రెండేళ్ళలో 23 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ఆయన నిన్న శ్రీకాకుళం జిల్లా కోట బొమ్మాళి మండలం చీపుళ్ల పాడులో 12.22 ఎకరాల్లో నిర్మిస్తున్న ఎంఎస్ ఎంఈ పార్క్‌కు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ...

.. వాయిస్.. 25 సెకన్లు

---------------------------

పద్మ అవార్డుల ప్రదానోత్సవం నిన్న రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్రమంత్రులు పాల్గొన్నారు. ఇద్దరు పద్మవిభూషణ్, ఆరుగురు పద్మ భూషణ్, 58 మంది పద్మశ్రీ అవార్డులను రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్రపతి నుంచి పద్మ అవార్డులు అందుకున్న తెలుగు వారిలో యూజీసీ మాజీ ఛైర్మన్, జాతీయ నూతన విద్యావిధానం-2020 రివ్యూ కమిటీ ఛైర్మన్ మామిడాల జగదీష్ కుమార్, అన్నమాచార్య సంకీర్తనల ద్వారా పేరు పొందిన గాయకులు స్వర్గీయ గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ తరపున ఆయన కుమారుడు అనిల్ కుమార్, హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రుల డైరెక్టర్, ప్రముఖ జీర్ణకోశ వ్యాధినిపుణుడు డాక్టర్ గూడూరు వెంకట్రావు, ప్రముఖ శాస్త్రీయ నృత్యకళాకారిణి దీపికారెడ్డి, ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణుడు, అపోలో క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పాలకొండ విజయానందరెడ్డి, ప్రఖ్యాత సంస్కృత పండితులు, కాంచీపురం శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహావిద్యాలయం కులపతి ప్రొఫెసర్ వెంపటి కుటుంబశాస్త్రి ఉన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన కీలక విధానాలు, ఆదాయ వృద్ధి చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. అమరావతి లోని సచివాలయంలో నిన్న జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో అమలులో ఉన్న ఎక్సైజ్ విధానం, దాని అమలు తీరుపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. లైసెన్స్ రుసుముల సవరణ, మద్యం దుకాణాల పునర్విభజన, పారదర్శకత పెంపు వంటి అంశాలపై అధికారులు వివరించారు.

---------------------------

ఈ నెల 30వ తేదీ వరకు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉన్నందున, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పఖర్ జైన్ సూచించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, వడదెబ్బ తగలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

=====================